క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సీతారామస్వామికి ప్రాతః కాలార్చన, బాల భోగం జరిపించిన అనంతరం ఆంజనేయస్వామికి తమలపాకులు, సింధూరంతో విశేష అర్చనలు జరిపించారు. అనంతరం హనుమాన్ చాలీసాను పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్, రామగోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ హరిత

విజయనగరం రూరల్: మండలంలోని 14 చెరువులకు సంబంధించి నీటి సంఘం ఎన్నికలు ఈ నెల 14న నిర్వహించనున్నట్టు నీటి పారుదల శాఖ ఏఈ హరిత తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత సిబ్బందితో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించి 11వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుందని ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. వంద ఎకరాలకు పైబడిన 14 చెరువులను గుర్తించి వాటికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


తొలగించిన ఆక్రమణలు

విజయనగరం: నగరంలోని సాలిపేట రహదారిలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక ఆక్రమణలను, విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నలనయ్య ఆదేశాలతో పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు. అలాగే ఎన్‌సీఎస్ థియేటర్ రోడ్ లో అనధికార ప్రకటన బోర్డులను తొలగించారు. సాలిపేట రోడ్‌లో అనధికారికంగా నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణ దశలోనే వాటిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే సహించబోమని స్పష్టం చేశారు. ఇదివరకే చాలాసార్లు అనధికార నిర్మాణాలపై హెచ్చరికలు జారీ చేశామని అయినా కొంతమంది బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టడాన్ని ఉపేక్షించబోమని వెల్లడించారు.

సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచాలి

- ఏపీఈపీడీసీఎల్ ఈఈ

విజయనగరం ఫోర్ట్: సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాధరావు అన్నారు. స్థానిక బాబా మెట్టలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యుత్ వినియోగదారుడు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వల్ల విద్యుత్ ఆదాతో పాటు బిల్లు కూడా తక్కువగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ బి.మురళి, ఏడీ ఎ.కిరణ్, ఏఈ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య కీర్తనాలాపన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదికపైన మంగళవారం రాత్రి వాగ్దేవీ కళాసమితి ఆధ్వర్యంలో పతివాడ త్రినాధస్వామి బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనాలాపన, భక్తిగీతాలాపన ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రసాద్ దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఆలయ సూపర్‌వైజర్ రమేష్‌కుమార్, సిరి మాను పూజారి బంటుపల్లి వెంకటరావు, పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, వేదపండితులు దూసి శివప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కోడి పందెంరాయుళ్లు

పూసపాటిరేగ: మండలంలోని బొర్రవాని పాలెం సమీపంలో కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఐ.దుర్గాప్రసాదు తెలిపారు. వారి నుంచి రూ.ఆరువేలు నగదు, నాలుగు కోళ్లు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

కూరగాయల సాగు భలే.. భలే...

- జిల్లాలో 2500 హెక్టార్లలో సాగు
- మెట్టు భూములలో సాగు విస్తీర్ణం అత్యధికం
- ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయగోదావరి జిల్లాలకు ఎగుమతి


అలుగోలులో సాగవుతున్న వంగ తోట

పూసపాటిరేగ: జిల్లాలో మెట్ట పంటలైన చెరుకు, పొగాకు, జనపనార సాగుపై ఒకప్పుడు ఆధారపడిన రైతులు లాభాలు ఆర్జించే పంటలపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో వరి, పత్తి, మినుమ పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో సీజన్‌లో 1500 హెక్టార్లలో, రబీలో 1000 హెక్టార్లలో కూరగాయాలు సాగు అవుతోంది. జిల్లాలో అత్యధికంగా రామభద్రపురం, జామి, నెల్లిమర్ల, మెంటాడ, పూసపాటిరేగ , బొండపల్లి మండలాల్లో అత్యధికంగా కూరగాయలు సాగు అవుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు ఇక్కడ నుంచే కూరగాయలు తరలిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో కూరగాయలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఇతర ప్రాంతాలలో కూరగాయలు సాగు గణనీయంగా తగ్గి కూరగాయలు దిగుమతులు తగ్గినప్పుడు ఇక్కడ పండించిన కూరగాయలకు మంచి గిరాకీ పెరిగి లాభాలు వస్తాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేసారు. చాలా మంది రైతులు పల్లపు భూములులో వరి పండించిన భూమలలోను కూరగాయలు సాగు చేస్తున్నారు.

మార్కెట్‌లో ధరలు బట్టి లాభాలు

మండల పరిధిలో ఎక్కువగా బీర, బెండ, వంకాయి, చిక్కుడు, గోరు చిక్కుడు. గుమ్మడి, సారకాయి, కర్రపెండలం, మునగ, కేబేజీ వంటి ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా కూరగాయలు సాగుకు రూ.10 నుంచి 15 వేల వరకు సాగుకు ఖర్చు అవుతోంది. ఎకరాకు సుమారు లక్ష పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

విత్తనాలకు రాయితీ

కూరగాయల పంట సాగు చేసే రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు హెక్టారు విస్తీర్ణంలో సాగు చేయడానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. హైబ్రిడ్ వెజిటబుల్ స్కీం ద్వారా రాయితీలు వున్నాయి. తీగజాతి కూరగాయల సాగు చేసే రైతులకు శాశ్వత పందిళ్లు వేయడానికి ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుంది.
– జ్యోత్స్న, ఉద్యానవన శాఖాధికారిణి, భోగాపురం

కూరగాయల పంటలకు రాయితీలు ఇవ్వాలి

కూరగాయలు సాగు చేసే రైతులకు రాయితీలు ఇవ్వాలి. ఇతర పంటలు సాగు చేయడం వలన దిగుబడులు లేక మద్దతు ధర లేకపోవడంతో ఎక్కువ మంది కూరగాయలు సాగుపైనే ఆసక్తి చూపిస్తున్నారు.వర్షాకాలంలో పంట నష్టపోయిన రైతులకు రాయితీలు కల్పించాలి.
– ఎ.లక్ష్మీనాయుడు, పతివాడ

ప్రశ్న పత్రాలను స్కూల్ కాంప్లెక్స్‌లో ఉంచాలి

- డీఈఓకి యూటీఎఫ్ వినతి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లాలో బుధవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం కానున్న ఎస్ఏ-1 పరీక్షలకు సంబంధించిన పేపర్లను స్కూల్ కాంప్లెక్స్‌లలో ఉంచాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ సభ్యులు డీఈఓ యు.మాణిక్యంనాయుడును మంగళవారం కలసి వినతిపత్రాన్ని అందజేసారు. పరీక్ష పేపర్లను మండల కేంద్రం నుంచి అన్ని పాఠశాలలు తీసుకెళ్లే పని ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉంటుందని వివరించారు. ఉన్నత పాఠశాలల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు తరగతుల వారీగా నిర్వహిస్తున్నారని రెండుసార్లు పరీక్ష పేపర్లు మండల కేంద్రాలకు వెళ్లడం ఉపాధ్యాయులకు శ్రమతో కూడిన పని అని తెలియజేసారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్‌లో పరీక్ష పేపర్లు ఉంచితే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని డీఈఓకి వినతిపత్రం ద్వారా చెప్పుకున్నారు. డీఈఓని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఈశ్వరరావు, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జేఆర్‌పీ పట్నాయక్, జిల్లా కార్యదర్శులు సీహెచ్ తిరుపతినాయుడు, జి.రాజారావు, అల్లు శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక కార్యదర్శులు మెరుగైన పనితీరు కనబరచాలి

విజయనగరం: క్షేత్ర స్థాయిలో మరింత మెరుగైన పనితీరును కనబరచాలని ప్రణాళిక కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ప్రణాళిక కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతిరోజు పర్యటనలు చేసి ఆయా సచివాలయ పరిధిలో అనధికార నిర్మాణాలు, ఆక్రమణలను గుర్తించి వెంటనే వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. స్పాట్ ఫైన్లు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. బాధ్యతాయుతంగా కృషి చేసి ప్రణాళిక విభాగానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఓ అప్పలరాజు, టిపిఎస్ అనిత, పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి


లేగదూడల ప్రదర్శనలో గెలిచిన రైతులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి తదితరులు

పూసపాటిరేగ: పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో సర్పంచ్ కోట్ల రాము నాయుడు ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం మరియు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 128 పశువులకు వివిధ రకాలు వ్యాధులకు చికిత్సలు అందజేసారు. ప్రదర్శనలో గెలిచిన పశువుల రైతులకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులు ప్రతి ఒక్క పశువుకి బీమా చేయించుకోవాలని సూచించారు. గ్రామాలలో డైరీలు ఏర్పాటు చేసినట్లయితే స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. కొవ్వాడ గ్రామానికి కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి నిధులు పూర్తి స్థాయిలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కోట్ల రామునాయుడు, జిల్లాపశు సంవర్ధక శాఖ జాయంట్ డైరెక్టర్ వైవీ రమణ, జిల్లా పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు రాధాకృష్ణ, ఏడీ జి.చక్రవర్తి, పశువైద్య కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ ప్రకాష్, వైద్యులు రాజేశ్వరి, సుధీర్, ఈశ్వర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సంబరాలు


చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

విజయనగరం టౌన్: స్థానిక అంబటిసత్రం వద్దనున్న యేసు ప్రేమాలయం ఆధ్వర్యంలో మంగళవారం వీటీ అగ్రహారం బీసీ కాలనీలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. దైవ సందేశం అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను పకడ్బందీగా నిర్వహించాలి


అన్న క్యాంటీన్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్

విజయనగరం: నగరంలో అన్న క్యాంటీన్లు మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు నిర్వాహకులు మరింత కృషి చేయాలని సూచించామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని అన్న క్యాంటీన్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, గోషాస్పత్రి, ప్రకాశం పార్క్ వద్ద ఉన్న క్యాంటీన్లను పరిశీలించి అక్కడ నెలకొన్న పరిస్థితులను గమనించారు. ముఖ్యంగా ఆహారం సుచిగా ఉందా.. లేదా.. అన్న విషయమై ఆహారం స్వీకరిస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. తరువాత వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మక అన్న క్యాంటీన్‌లు నిర్వహిస్తున్న తరుణంలో ఆకస్మిక తనిఖీలను కూడా అప్పుడప్పుడు చేపడుతుంటామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పౌష్టికాహారం, వేడివేడి ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు వరి కోతలు ఆపాలి

విజయనగరం రూరల్: రాబోయే మూడు రోజులు పాటు వర్షాభావ పరిస్థితులు ఉండటం వల్ల రైతులు వరికోతలను ఆపాల్సిందేనని జిల్లా రీసోర్స్ సెంటర్ ఏడీఏ శేఖర్‌బాబు సూచించారు. మండలంలోని జొన్నవలస గ్రామంలో ఏఓ లత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ ఇప్పటికే వరి పంట కోసిన రైతులు కుప్పలుగా వేసుకుని ఆ కుప్పలపై తార్పాన్లను కప్పి ఉంచుకోవాలన్నారు. అలాగే రబీ పంటలైన పెసర, మినుములు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో మంగళవారం వేకువజామున ఓ పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వృద్ధుడు మాడుగుల గురువులు ఒంటరిగా పూరింటిలో నివాసం ఉంటున్నాడు. వేకువజామున అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఇంట్లో నిద్రిస్తున్న గురువులు తేరుకుని తప్పించుకుని బయటకు వచ్చాడు. మంటలు భారీగా చెలరేగి క్షణాల్లో ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి చెందిన దుస్తులు, కొంత నగదు, ఇతర వస్తువులు ఆహుతయ్యాయి. సుమారు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఉపాధి కల్పనే లక్ష్యం


అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్న ఐటీఐ సిబ్బంది

విజయనగరం రూరల్: చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ అన్నారు. వి.టి. అగ్రహారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 94మంది అభ్యర్థులు హాజరు కాగా 32మంది నిరుద్యోగులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. రెండవ జాబితా నుంచి మరో ఎనిమిది మంది ఎంపిక కావడం జరిగిందన్నారు. జాబ్‌మేళాలో స్పందన, స్ఫూర్తి, ఉన్నోవా, సోర్స్, హెల్త్‌కేర్‌కు చెందిన ప్రముఖ కంపెనీలకు మౌఖిక పరీక్షలు నిర్వహించామన్నారు. ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన వారికి రూ.13వేలు నుండి 25వేల వరకూ వేతనం ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఐటీఐ కన్వీనర్ అరుణ, కిషోర్‌కుమార్, ప్రిన్సిపాల్ టి.వి.గిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ


గోవిందపురంలో ఆయుష్మాన్ భారత్ ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పూసపాటిరేగ: దీర్ఘకాలిక వ్యాధుల నివారణ ఆయుష్ వైద్యంతోనే సాధ్యమవుతోందని సీనియర్ మెడికల్ ఆఫీసర్ బి.వరప్రసాద్ అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ముందుగా ఆయుష్మాన్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచకర్మ మసాజ్ ద్వారా ఎన్నో వ్యాధులు నయం అవుతాయన్నారు. గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా వుంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. సాధారణ వ్యాధులు, మధుమేహం వంటి వ్యాధుల పట్ల అవగాహన చేసుకోవాలని సూచించారు. మానవుని జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పంచకర్మ, సిద్ధ, యోగ, హోమియో వంటి ప్రకృతి వైద్యం పూర్తిగా అందుబాటులో వుంటుందన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోవిందపురం పీహెచ్‌సీ వైద్యులు కె.త్రినాథ్, ఎ.వెంకట సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలి

నెల్లిమర్ల: అర్హులైన పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు కోరారు. మంగళవారం నెల్లిమర్ల సచివాలయం - 2 కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పాపారావు మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ, చిల్లర వ్యాపారాలు చేసుకుంటూ అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అయినా పక్కా గృహాలు మంజూరు చేసి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం న్యూ డెమోక్రసీ నాయకుడు కాళ్ల అప్పలసూరి, ఎల్.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లిమర్ల రూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ సుదర్శనరావు తెలిపారు. మండలంలోని పారసాంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. పారసాంలో మ్యుటేషన్‌లకు సంబంధించి ఆరు దరఖాస్తులు అందాయని, నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ గొలజాన నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాధం పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

నగరంలో కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన గుంతల పూడ్చివేత, పాక్షిక మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతను గమనించారు. బాబా మెట్ట గాంధీ పార్కును సదర్శించారు. అక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని స్థానికుల అభ్యర్థన మేరకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం గణేష్ కోవెల ఎదురుగా గంజిపేట ప్రాంతంలో పైపులైన్ లేదని స్థానికులు చెప్పగా అంచనాలు రూపించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. ఆయన వెంట ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు ఉన్నారు. అనధికారికంగా ప్రభుత్వ స్థలాలు, చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.
– విజయనగరం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

విజయనగరం పట్టణం 20వ వార్డు పైనల వీధి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధనకు నేటి యువత పాటుపడాలన్నారు. పావడ రాంబాబు, మొయ్య రమణ, ఎస్.ఈశ్వర్, పి.సూర్యనారాయణ, పి.కుమార్, పైడిరాజు గోపి సూర్యనారాయణ, తలే మధుసూదనరావు, పంచాయతీరాజ్ డీఈఈ తలే రమణ కృషితో ఈ విగ్రహ ఏర్పాటు జరిగిందన్నారు. కార్యక్రమంలో తలే సీతారాం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ తలే ఈశ్వరీబాయి, గండిపిల్లి సింహాచలం, పాండ్రంకి వెంకటరమణ, గంట వీర్రాజు, జి.మహేంద్రబాబు, పి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.
– విజయనగరం



సచివాలయాల్లో నిఘా..



నెల్లిమర్ల నగర పంచాయతీ, మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని మహిళా పోలీసులకు ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ మద్యపానం, గంజాయి విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి వివాదాలు చోటు చేసుకున్నా తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.
– నెల్లిమర్ల

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

- తహసీల్దార్ సుదర్శనరావు


ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ సుదర్శనరావు హెచ్చరించారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో లోతుగెడ్డ ఆక్రమణలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వెళ్లి హెచ్చరిక బోర్డులను మంగళవారం ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 212లో కొంత మంది ప్రభుత్వ గెడ్డను ఆక్రమించినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే ఆక్రమణలు తొలిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి రాజేష్‌కుమార్

విజయనగరం: ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా పెట్టుకుందని డిసెంబరు 10వ తేదీన మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ చక్రవర్తి ఆదేశాల మేరకు అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని జిల్లా కోర్టు కాన్ఫరెన్సు హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న పారిస్ వేదికగా సభ్య దేశాలన్నీ ఒక కీలక ఒప్పందం చేసుకున్నాయన్నారు. అప్పటి నుంచి డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మనిషి స్వతంత్రంగా జీవించి తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి బి.అప్పలస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రామతీర్థంలో విజయవాడ కనకదుర్గమ్మ ప్రచార రథం


రామతీర్థంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానం వద్దకు విజయవాడ కనకదుర్గమ్మ వారి ప్రచార రథం మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవాయిద్యాల నడుమ దేవస్థాన అర్చకులు, సిబ్బంది అమ్మవారి రథానికి ఆహ్వానం పలికారు. అనంతరం దేవస్థానం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూల దండలను సమర్పించారు. దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సమీప గ్రామాలకు చెందిన భవానీ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, వరప్రసాద్, కిరణ్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.